క్లుప్తంగా

ఉచిత కంటివైద్య శిబిరం



కంటి పరీక్ష చేస్తున్న డాక్టర్ అభిషేక్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల కేంద్రంలో గురువారం రఘునాథ్ వెరబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య పరీక్ష శిబిరం నిర్వహించారు. శిబిరానికి మండలంలోని ఆయా గ్రామాల నుంచి 300మందికి పైగా హాజరుకాగా, వారికి కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ చేతుల మీదుగా ఉచితంగా కంటి అద్దాలు అందజేశారు. 70మందికి కంటి శస్త్ర చికిత్స అవసరమని గుర్తించగా త్వరలోనే వారికి కంటి శస్త్ర చికిత్స చేయిస్తామని రఘునాథ్ తెలిపారు. కార్యక్రమంలో కంటి వైద్యుడు అభిషేక్, బీజేపీ నాయకులు జూపాక ధర్మయ్య, రజనిశ్‌జైన్, స్వామిరెడ్డి, రఘుపతి, రాజనర్సు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులు రాణించాలి

మంచిర్యాలఅర్బన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం మహిళ సాధికరత సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చక్రపాణి మాట్లాడుతూ.. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. సమాజంలో నైతిక విలువలతో మెలగాలన్నారు. మహిళా సంక్షేమ పథకాలు, గృహహింస చట్టంపై సఖీ సెంటర్ పారా మెడికల్ రమ్య వివరించారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో విజయ, వైస్ ప్రిన్సిపాల్ పట్వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతి



డెప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తూ..

కాసిపేట: ప్రభుత్వ భూమిని కాపాడి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని గురువారం సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో డెప్యూటీ తహసీల్దార్ మాణిక్‌రావుకు వినతిపత్రం సమర్పించారు. మండలంలోని సోమగూడెం (కె) గ్రామపంచాయతీలోని సర్వేనంబర్ 146/14లో ప్రభుత్వ భూమిని కబ్జా చేసే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ భూమి కేకే ఓపెన్‌కాస్టు పరిధిలో లేకున్నా, ఉన్నట్లు నకిలీపత్రాలు సృష్టించి పరిహారం పొందిన వారిపై విచారణ జరిపి చర్యలకు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భుక్య చందులాల్, ఉపసర్పంచ్ కనుకుల రాకేష్, యూత్ నాయకులు ఆజ్మీర రాజా, రవి, శివసాయి, ఇస్లావత్ రాజేశ్వర్ తదితరులున్నారు.

బస్సును పునరుద్ధరించాలని వినతి

నెన్నెల: మండలంలోని కోణంపేటకు ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని కోరుతూ ఆ గ్రామ యువకులు గురువారం మంచిర్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ రవీంద్రనాథ్‌కు వినతిపత్రం సమర్పించారు. గతంలో తమ గ్రామానికి వచ్చే బస్సును నిలిపివేయడంతో విద్యార్థులు, గిరిజనులు, మహిళలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ ప్రాంతానికి బస్సు సౌకర్యం కల్పిస్తే నెన్నెల, లంబాడితండా, కుర్మగూడం, మన్నెగూడం, బోగంపల్లి, పాటి, శ్రావణ్‌పల్లి గ్రామాల ప్రజలకు ఉపయోగంగా ఉంటుందన్నారు. 22కిలోమీటర్ల దూరంలో ఉన్న బెల్లంపల్లికి వెళ్లి రావాలంటే ఆటోలు, ప్రైవేట్ వాహనాలకు రూ.200చెల్లించాల్సి వస్తోందన్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సును కోణంపేటకు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ యువకులు రాంటెంకి శ్రీనివాస్, సున్నారి సంతోష్, సయ్యద్ సోని, రవి, శంకర్, జనార్దన్‌లు ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ప్లంబర్స్ అసోసియేషన్



పాతమంచిర్యాల: జిల్లా ప్లంబర్స్ అసోసియేషన్ నాయకులు గురువారం ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్లంబర్స్ అసోసియేషన్ కార్యాలయానికి స్థలం కేటాయించాలని కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని ప్లంబర్స్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్లంబర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పాట్బాల మల్లేష్, ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్, కార్యదర్శి ఆంజనేయులు, కోశాధికారి అంజీ, ప్రచార కార్యదర్శి ఎన్వీ చారి, కార్యవర్గ సభ్యులు సతీష్, రాంచందర్, నిమ్మల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పొట్ట కొట్టొద్దు.. దారి చూపండి

- 'మహాలక్ష్మి' పథకంతో ఆటో, జీపు డ్రైవర్లకు తగ్గిన గిరాకీ
- ప్రభుత్వం చేయూతనివ్వాలని వేడుకోలు

'మహాలక్ష్మి పథకం కింద మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణంతో మా పొట్టలు కొట్టొద్దు. సంవత్సరాలుగా ఆటోలు నడుపుతూ కుటుంబాలను పోషించుకుంటున్నాం. ఇప్పుడు ఆటోల గిరాకీ తగుతోంది. రోజంతా నడిపితే డీజిల్ వరకే సరిపోతుంది. ప్రభుత్వం మా ఇబ్బందులు గుర్తించి మాకు ఉపాధి అవకాశాలు కల్పించాలి...' ఇది జన్నారం మండలం కలమడుగు గ్రామానికి చెందిన ఫయీం అనే ఆటో యజమాని ఆవేదన వ్యక్తం చేశాడు.

'సంవత్సరాలుగా టాటా ఏసీ బండి నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. వాహనం పై ఆధారపడి జీవిస్తున్నాం. కానీ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం వల్ల మాకు గిరాకీలు తగ్గి, కుటుంబ పోషణ ఇబ్బంది అవుతుంది. ప్రభుత్వం ఈ విషయంలో ఆలోచన చేసి మాకు చేయూతనివ్వాలి..' అని జన్నారం మండలం మురిమడుగు గ్రామానికి చెందిన రాజు వేడుకుంటున్నాడు.



ఆందోళన చేస్తున్న ఆటో డ్రైవర్లు (ఫైల్)

జన్నారం: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, మేనిఫెస్టోలో పెట్టిన విధంగా ఈ నెల 9న మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించారు. అప్పటి నుంచి ఆటో కార్మికులు, యజమానులు ఆందోళనలకు దిగుతున్నారు. జన్నారం మండల కేంద్రం నుంచి సుమారుగా 600మంది ఆటోల ద్వారా, 30మంది టాటా మ్యాజిక్, జీపుల ద్వారా ఉపాధి పొందుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వాహనాల ద్వారా ప్రయాణికులను గమ్య స్థానాలకు చేరుస్తున్నారు. ఫైనాన్స్‌లలో ఆటోలను, వాహనాలను తీసుకుని, రోజూ వచ్చే డబ్బులతో ఫైనాన్స్ చెల్లిస్తూ, మిగిలిన డబ్బులతో సరుకులు కొని కుటుంబాలను పోషించుకుంటున్నట్లు డ్రైవర్లు వాపోతున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం నిర్ణయంతో నిద్రపోలేని పరిస్థితి ఏర్పడిందని ఆటో, జీపు డ్రైవర్లు వాపోతున్నారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి..

నిత్యం ఆటోలు, జీపులు నడుపుతూ కుటుంబాలను పోషించుకుంటున్న వారిని ప్రభుత్వం ఇబ్బందుల్లోకి నెట్టింది. ఆందోళనలు చేపట్టినా ప్రభుత్వం పట్టింపులేకుండా ఉంది. మా ఇబ్బందులు స్థానిక ఎమ్మెల్యేలు, అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతున్నారు. ప్రతి ఆటో, టాటా మ్యాజిక్, జీపుపై ఫైనాన్స్ తీసుకున్నట్లు, ఇప్పుడు గిరాకీలు లేక ఫైనాన్స్ డబ్బులు చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిరాకీలు తగ్గితే ఆటోలను, జీపులను ఫైనాన్స్ యజమానులు తీసుకెళ్లే ప్రమాదం ఉందన్నారు. ఇలాగే జరిగితే మాకు ఆత్మహత్యలే శరణ్యమని వాపోతున్నారు. ప్రభుత్వం దృష్టి సారించి ఉచిత బస్సు ప్రయాణాన్ని రద్దు చేయాలని, లేదా ఆటో డ్రైవర్లు, ఓనర్లకు మరో ఉపాధి అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

గిరాకీ లేక ఫైనాన్స్ కడుతలేను



గత పది సంవత్సరాలుగా ఆటో నడుపుతూ ఉపాధి పొందుతున్నాను. ఇటీవల ఆటోను తీసుకున్నాను. దీనిపై రూ.పది వేల ఫైనాన్స్ తీసుకున్నాను. ఉచిత బస్సు ప్రయాణం ద్వారా గిరాకీలు తగ్గాయి. దీంతో ఫైనాన్స్ కట్టలేని పరిస్థితి ఏర్పడింది. మా ఇబ్బందులను ప్రభుత్వం గుర్తెరిగి ఆదుకోవాలి.

– వెంకటేశ్, ఆటోడ్రైవర్, కలమడుగు

రూ.10 వేలు భృతి ఇవ్వాలి..



ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం ద్వారా మా పొట్టలు కొడుతుంది. ఉపాధి అవకాశం కోల్పోతున్నాం. రోజుకు ఫైనాన్స్ ఖర్చులు పోను రూ.300వరకు సంపాదించుకుంటున్నాం. దీంతో కుటుంబ పోషణ, చదువుల ఖర్చులకు ఉపయోగించుకుంటున్నాం. గిరాకీలు తగ్గి ఉపాధి కోల్పోతున్న మాకు ప్రభుత్వం రూ.10వేలు భృతి ఇవ్వాలి.

– నసీమొద్దీన్, ఆటో యూనియన్ అధ్యక్షుడు

ఆత్మహత్యలే శరణ్యం..



ప్రభుత్వం నిర్ణయం మాకు నిద్ర లేకుండా చేస్తుంది. రోజూ జన్నారం నుంచి లక్సెట్టిపేటకు జీపు నడుపుకుంటున్నాను. ఫైనాన్స్ పోను మిగిలిన డబ్బులతో కుటుంబాలను పోషించుకుంటున్న మాకు ప్రభుత్వం ఉచిత బస్సు ప్ర యాణం పెట్టడం ఇబ్బంది పెడుతోంది. రోజంతా కష్టపడితే ఫైనా న్స్‌కు కూడా రావడం లేదు. ఇలాగే ఉంటే ఆత్మహత్యలే మాకు శరణ్యం. ప్రభుత్వం పునరాలోచించాలి.

– బాబ, జీపు అసోసియేషన్ అధ్యక్షుడు

అయోధ్య రాముడి అక్షింతలు పంపిణీ



కరపత్రాలు విడుదల చేస్తున్న వీహెచ్‌పీ శ్రేణులు

బెల్లంపల్లి: శ్రీరామ జన్మభూమి క్షేత్రమైన అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేయడానికి సిద్ధమైనట్లు విశ్వహిందూ పరిషత్ బెల్లంపల్లి పట్టణ ఉపాధ్యక్షుడు గోలి శ్రీనివాస్ తెలిపారు. బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 1వ తేదీ నుంచి ఇంటింటా అక్షింతలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. జనవరి 22వ తేదీన అయోధ్యలో రామ మందిరం ప్రారంభోత్సవం జరుగుతుందని తెలిపారు. అత్యంత వైభవంగా నిర్వహించే రామ మందిర ప్రారంభోత్సవానికి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. విశ్వహిందూ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ పాటు పడాలన్నారు. సమావేశంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు రాజలింగు, రాజనర్సు, రాజశేఖర్, నారాయణ, బాపు, వెంకటేష్, స్రవంతి, రమేష్ పాల్గొన్నారు.

ఆలయ కమిటీ ఎన్నిక

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం నంనూర్ పునరావాస కాలనీలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా బేర పోచయ్య, ప్రధాన కార్యదర్శిగా పెద్దపల్లి స్వామి, ఉపాధ్యక్షుడిగా ఒడ్డె బాలరాజు, సహాయ కార్యదర్శిగా ఒడ్డె శ్రీనివాస్, కోశాధికారిగా కారుకూరి తిరుపతి, కార్యనిర్వాహక సభ్యులుగా అత్తె తిరుపతి, ఒడ్డె రాజమౌళి, ఆకిరెడ్డి వెంకటేశ్ ఎన్నికయ్యారు. ఎన్నిక పర్యవేక్షకులుగా రాసమల్ల శ్రీనివా సగౌడ్, గోవు లింగయ్య వ్యవహరించగా వచ్చే ఏడా ది మహాశివరాత్రి వరకు హనుమాన్ ఆలయ నిర్మాణం పూర్తి చేసి ప్రతిష్ఠా మహోత్సవాన్ని నిర్వహిస్తామని నూతన ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

గ్రామీణ తపాలా ఉద్యోగుల సమ్మె



దొనబండలో సమ్మెలో పాల్గొన్న పోస్టల్ ఉద్యోగులు



బెల్లంపల్లి: సమ్మె చేస్తున్న తపాలా ఉద్యోగులు

బెల్లంపల్లి: సమస్యల పరిష్కారం కోసం గ్రామీణ తపాలా ఉద్యోగులు నిరవధిక సమ్మె చేపట్టారు. అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం (ఏఐపీఈయూజీడీఎస్)ఆధ్వర్యంలో గురువారం బెల్లంపల్లిలోని పోస్టాఫీస్ ఎదుట గ్రామీణ డాక్ సేవకులు సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ... చాలీచాలని వేతనాలను చెల్లిస్తూ కేంద్ర ప్రభుత్వం గ్రామీణ తపాలా ఉద్యోగులతో వెట్టి చాకిరి చేయిస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొస్తున్న ప్రతీ స్కీమ్‌కు తపాలాశాఖను భాగస్వామ్యం చేసి పనిభారాన్ని పెంచుతోందని తెలిపారు. గ్రామీణ డాక్ సేవకులకు క్యాష్‌లెస్ వైద్య సదుపాయం కల్పించాలని, రూ.5లక్షల గ్రాట్యూటీ పెంచడంతో పాటు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కొత్తగా విధుల్లో చేరిన ఉద్యోగులకు రెండో పే స్కేల్ ద్వారా వేతనాలు అందించాలన్నారు. ఆర్ఐసీటీ మిషన్లకు బదులు లాప్‌ట్యాప్‌లు, ప్రింటర్లు అందజేసి సబ్సిట్యూట్‌లకు సకాలంలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు, సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. అంతవరకు సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సంఘం జిల్లా నాయకులు నాగేశ్వరరావు, రామారావు, సభ్యులు విజయ్, రామకృష్ణ, శంకర్, అరుణ్ పాల్గొన్నారు.

భీమారం: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పోస్టల్‌శాఖలోని గ్రామీణ డాక్ సేవక్‌లు సమ్మెకు దిగారు. సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగిస్తామని వారు హెచ్చరించారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలో దొనబండ పోస్టాఫీస్ కార్యాలయం ఎదుట అఖిల భారత తపాలా ఉద్యోగుల(జీడీఎస్) సంఘం పిలుపు మేరకు దేశవ్యాప్త నిరవధిక సమ్మెలో భాగంగా హాజీపూర్‌లోని పోస్టల్ ఉద్యోగులు సమ్మెబాట పట్టారు. సమ్మెలో మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్న బీపీఎంఎస్, ఏబీపీఎంఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

బడి బయట పిల్లల సర్వే



పిల్లలతో మాట్లాడుతున్న సీఆర్పీ రాజ్‌నారాయణ

నెన్నెల: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు రాష్ట్ర విద్యాశాఖ చేపట్టిన చర్యల్లో భాగంగా నెన్నెల మండలంలోని గన్‌పూర్, నెన్నెల గ్రామాల్లో గురువారం బడి బయట పిల్లలను గుర్తించేందుకు సర్వే చేపట్టారు. మధ్యలో చదువు మానేసిన పిల్లలను బడిలో చేర్పించాలనే లక్ష్యంతో సర్వే చేపడుతున్నామని ఎంఈఓ మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. 6 నుంచి 14సంవత్సరాల లోపు, 15 నుంచి 19సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలు బడిబయట విద్యార్థులను గుర్తిస్తున్నామన్నారు. ఈ పిల్లలను పాఠశాలల్లో చేర్పించనున్నట్లు చెప్పారు. బడి బయట పిల్లలందరినీ తల్లిదండ్రులు పాఠశాలకు పంపించాలని సూచించారు. గుర్తించిన పిల్లలను విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రబంద్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయనున్నట్లు చెప్పారు. జనవరి 10వ తేదీ వరకు ఈ సర్వే కొనసాగుతుందని తెలిపారు. ఈ సర్వేలో మండల నోడల్ అధికారి ప్రకాష్‌రావు, సీఆర్పీలు పాల్గొన్నారు.

చెన్నూర్‌రూరల్: మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో గురువారం బడి బయట పిల్లలపై సర్వే నిర్వహించారు. సీఆర్పీ రాజ్‌నారాయణ 6–14 సంవత్సరాల లోపు బడికి రాని పిల్లల వివరాలు సేకరించారు. రాజ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

'భగీరథ' పైపులైన్ లీకేజీ



రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్–క్యాతనపల్లి మార్గమధ్యంలోని ఆర్‌వోబీ వద్ద మిషన్ భగీరథ పైపులైన్ గురువారం సాయంత్రం లీకేజీ అయింది. మంచిర్యాలకు వెళ్లే ప్రధాన మార్గంలో మెయిన్ పైపులైన్ లీక్ కావడంతో నీరు ఎగిసిపడగా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పక్కనే ఉన్న కరెంటు తీగలపై నీరు ఎగిసిపడటంతో వాహనదారులు ఆందోళన చెందారు. స్థానికులు అధికారులకు సమాచారం ఇవ్వడంతో నీటి సరఫరాను నిలిపివేశారు.

బొగ్గుబాయి వార్తలు

సీఎంపీఎఫ్ పుస్తకాలివ్వాలి

శ్రీరాంపూర్: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు సీఎంపీఎఫ్ పాస్ పుస్తకాలు ఇవ్వాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి గట్టు మహేందర్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తమ పోరాట ఫలితంగా సీఎంపీఎఫ్ శాఖ నుంచి పాస్ పుస్తకాలు అన్ని ఏరియాలు పంపిణీ చేసిందన్నారు. అన్ని ఏరియాల్లో అధికారులు వీటిని పంపిణీ చేస్తున్నా, శ్రీరాంపూర్‌లో మాత్రం పంపిణీ చేయడం లేదన్నారు. వెంటనే అధికారులు స్పందించి పాస్ పుస్తకాలను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

కార్మిక సంక్షేమం ఐఎన్టీయూసీతోనే సాధ్యం



మేనిఫెస్టో విడుదల చేస్తున్న శ్రీనివాస్

తాండూర్: కార్మిక సంక్షేమం ఐఎన్టీయూసీతోనే సాధ్యమని ఆ సంఘం ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్ అన్నారు. బెల్లంపల్లి ఏరియా గోలేటి వర్క్‌షాప్‌లో గురువారం ఐఎన్టీయూసీ మేనిఫెస్టోను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో సంఘం నిత్యం అందుబాటులో ఉంటుందన్నారు. ఈ నెల 27న జరిగే సింగరేణి ఎన్నికల్లో కార్మికులు భారీ మెజార్టీతో ఐఎన్టీయూసీ సంఘాన్ని గెలిపించాలని కోరారు. అధికారంలోకి వస్తే కార్మికులకు 250గజాల ఇంటి స్థలంతో పాటు రూ.20లక్షల వడ్డీ లేని రుణం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఐఎన్టీయూసీ ఫిట్ కార్యదర్శి కోటేశ్వరరావు, జీపీ చంద్రకుమార్, నాయకులు దామెర సదానందం, కార్మికులు పాల్గొన్నారు.

హక్కులు సాధించిన సంఘానికే అండగా నిలువండి



మాట్లాడుతున్న నాయకులు

రామకృష్ణాపూర్: సింగరేణి కార్మికులకు అనేక హక్కులు సాధించిపెట్టిన ఏఐటీయూసీ యూనియన్‌కే గుర్తింపు ఎన్నికల్లో కార్మికులు అండగా నిలువాలని ఆ యూనియన్ కేంద్ర కార్యదర్శి అక్బర్‌అలీ కోరారు. మందమర్రి ఏరియాలోని ఆర్‌కేపీ ఏరియా ఆసుపత్రిలో గురువారం నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణిలో రాజకీయ నాయకుల జోక్యం వల్ల సంస్థ అనేక రకాలుగా నష్టపోతున్న తీరు అందరం చూస్తున్నామని పేర్కొన్నారు. ఎన్నికల దృష్ట్యా ఆయా సంఘాలు చెప్పే మాటలు నమ్మి కార్మికులు మోసపోవద్దన్నారు. కార్మికుల పక్షాన రాజీలేని పోరాటాలు సాగించే ఏఐటీయూసీ చుక్క గుర్తుకే కార్మికులు ఓటువేసి చక్కటి మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. యూనియన్ బ్రాంచి కార్యదర్శి అంజనేయులు, ఇప్పకాయల లింగయ్య, సుజాత, రఘు, శ్రీధర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి




మాట్లాడుతున్న సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: ఈ నెల 23న జరిగే సింగరేణి ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి తెలిపారు. ఏరియా అధికారులతో వేడుకలపై గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రగతి మైదానంలో జరిగే ఈ వేడుకల్లో ఆకట్టుకొనే స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. సాయంత్రం నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాలన్నారు. హాజరయ్యే కార్మిక కుటుంబాలకు తాగునీరు, ఇతర వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏరియా ఎస్‌ఓటు జీఎం రఘుకుమార్, ఏరియా ఇన్‌చార్జి చంద్రశేఖర్‌రెడ్డి, ఏజీఎం మురళీధర్, ఓసీపీ పీఓలు పురుషోత్తంరెడ్డి, శ్రీనివాస్ ఏజెంట్లు గోపాల్‌సింగ్, రాముడు, ఏవీ రెడ్డి, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవులు, క్వాలిటీ మేనేజర్ కే వెంకటేశ్వర్‌రెడ్డి, సీనియర్ పీఓ కాంతారావులు పాల్గొన్నారు.

'కార్మికుల పక్షాన ఉండి హక్కులు సాధిస్తాం'

కాసిపేట: కార్మికుల పక్షాన ఉండి హక్కులు సాధిస్తామని, వచ్చే సింగరేణి ఎన్నికల్లో ఐఎన్టీయూసీని భారీ మెజార్టీతో గెలిపించాలని ఐఎన్టీయూసీ సెంట్రల్ సెక్రెటరీ రాపర్తి శ్రీనివాస్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వేముల కృష్ణ, మాజీ పీఏసీఎస్ చైర్మన్ వంశీకృష్ణరావు కార్మికులను కోరారు. మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో కార్మికులతో కలిసి మాట్లాడుతూ.. కాసిపేట 1, 2గనుల్లో కార్మికులు ఐఎన్టీయూసీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్మికులను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నట్లు, సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. నాయకులు సిద్ధం తిరుపతి, మాజీ సర్పంచ్ ఉత్తూరి సత్తయ్య, నస్పూరి నర్సింగ్, సామ లక్ష్మణ్, మడావి వెంకటేష్, మునీందర్, కుమారస్వామి తదితరులున్నారు.

మహిళలకు దీపాలంకరణ పోటీలు



పోటీలు వీక్షిస్తున్న రాధాకుమారి, అధికారులు →

నస్పూర్: సింగరేణి ఆవిర్భావ వేడుకల్లో భాగంగా శ్రీరాంపూర్ ఏరియా సేవా సమితి ఆధ్వర్యంలో నస్పూర్ కాలనీలోని సేవా భవన్ ఆవరణలో మహిళలకు దీపాలంకరణ పోటీలు నిర్వహించారు. గురువారం సాయంత్రం నిర్వహించిన పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొని దీపాలను అందంగా అలంకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీరాంపూర్ ఏరియా సేవా అధ్యక్షురాలు రాధాకుమారి పాల్గొని దీపాలంకరణ పోటీలను వీక్షించారు. పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన వారికి ఈ నెల 23న నిర్వహించనున్న ఆవిర్భావ వేడుకల్లో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ అరవిందరావు, సేవా సమితి సభ్యులు లక్ష్మి, సూర్యలక్ష్మి, ఏరియా రక్షణాధికారి శ్రీధర్‌రావు, అధికారులు ప్రంబంధిత, కాంతారావు, సంతన్, రజిత, సురేష్, మౌనిక, మల్లేశ్వరి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఆర్థికసాయం అందజేత

దండేపల్లి: లక్సెట్టిపేట మండలం ఎల్లారంకు చెందిన మల్లికార్జున్, ఆయన భార్య శరణ్య కొద్ది నెలల క్రితం చనిపోయారు. దీంతో వారిద్దరి పిల్లలు ఇవాంక, ఓంకార్‌లు అనాథలయ్యారు. మల్లికార్జున్‌తో దండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2006–07లో పదోతరగతి చదివిన మిత్రులంతా కలిసి రూ.30 వేలు జమచేసి మల్లికార్జున్ ఇద్దరు పిల్లలకు గురువారం అందించి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు.

వేమనపల్లి: మండలంలోని నీల్వాయి గ్రామంలోని శివాలయంలో భక్తుల సౌకర్యం కోసం గ్రామానికి చెందిన మంచినీళ్ల నాగరాజు, శైలేశ్వరం శేఖర్, లకన్, రెబ్బెన సంతోష్ ఆర్థిక సాయం చేయగా బోరు, మోటారును గురువారం ఏర్పాటు చేశారు. ఎంపీటీసీ సంతోష్‌కుమార్, సర్పంచ్ గాలి మధు మోటారు స్టార్ట్ చేసి ప్రారంభించారు.

రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేటలో గౌడ కులస్తులు గురువారం రేణుకా ఎల్లమ్మ ఆలయంలో దేవీ విగ్రహాన్ని ఆలయంలో వేదమంత్రాల నడుమ ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో అర్చకులు, గౌడ కులస్తులు ఉన్నారు.

సోమగూడెంలో మెగా వైద్యశిబిరం

కాసిపేట: మండలంలోని సోమగూడెం(కె) గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం సర్పంచ్ సఫాట్ శంకర్ ఆధ్వర్యంలో కరీంనగర్ సన్‌షైన్, ప్రతిమ కంటి ఆస్పత్రి సహకారంతో మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు షుగర్, బీపీ, ఈసీజీ ఆర్థో కంటి పరీక్షలను నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కంటి సమస్య ఉన్నవారికి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దాసరి వెంకటరమణ, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, ఆర్ఐ సులోచన, పంచాయతీ కార్యదర్శి కీర్తి, వైద్యసిబ్బంది తదితరులున్నారు.

కొత్తపల్లిలో వైద్య శిబిరం

వేమనపల్లి: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఎన్‌సీడీ కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారి రాజేష్ ఆధ్వర్యంలో గురువారం బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గ్రామాల్లో ఎన్‌సీడీ వైద్య శిబిరాలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ లింగయ్య, భాగ్యలక్ష్మి, ఆశలు శారద, సుజాత తదితరులు పాల్గొన్నారు.